

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**భేఖయాలీమే భీ తేరా హీ ఖయాల్ ఆయే**

**క్యూన్ బిఛడ్ నా హై జరూరీ, యే సవాల్ ఆయే**

2019లో విడుదలయిన హిందీ సినిమా 'కబీర్ సింగ్' సినిమాలోని పాట ఇది. ఇది తెలుగులో సూపర్ హిట్ అయిన 'అర్జున్‌రెడ్డి' సినిమాకు రీమేక్. తెలుగులో ఎంత హిట్ అయిందో, హిందీలోనూ అంతే హిట్ అయింది సినిమా. కానీ తెలుగులోలా సమాజాన్ని కుదపలేకపోయింది. హిందీ సినిమాలో ఈ పాట అత్యంత ప్రజాదరణ పొందింది. ఇర్షాద్ కామిల్ రాసిన ఈ పాటకు 'సచేత్ – పరంపర' సంగీత దర్శకత్వం వహించారు. అర్జిత్ సింగ్ అత్యంత విషాదాన్ని చిలికిస్తూ పాటకు ప్రాణం పోశాడు. ఇటీవలి కాలంలో సూపర్ హిట్ పాటల జాబితాలో చేరింది ఈ విషాద గీతం.

ఇటీవలే విడుదలయిన ఓ హిందీ సినిమా పాటల పుస్తకం చదువుతూంటే, మొదటి మాట మొదటి పేరాలో రెండో వాక్యంలోనే పంటికింద రాయి తగిలి నిద్రపోతున్న మెదడు ఉలిక్కిపడేట్టు చేసింది. ఇప్పుడు వస్తున్న సినిమాలలో, హిందీ సినిమా పాటల పుస్తకం కాబట్టి హిందీ సినిమా పాటలలో అనుకోవటం స్వాభావికం, విషాదగీతాలు దాదాపుగా అడుగంటాయని, అక్కడో పాట, ఇక్కడో పాట వినిపిస్తుంది అంతే అన్న భావం వచ్చే వాక్యాలున్నాయి ఆ పేరాలో.

తెలుగులో సినిమాల గురించి, ముఖ్యంగా హిందీ సినిమాలు, పాటల గురించి ఎవరు పడితే వారు, ఎలా పడితే అలా రాసేస్తూండటం, వారికి ప్రసిద్ధులయిన స్నేహితులుంటే, అధ్యయనం, అవగాహనలు లేకుండా వీరు రాసిందే గొప్ప అని ప్రచారం చేసేయటం ఒక స్థిర పడిన సాంప్రదాయం. అందుకే పలువురు ఈ ముందు మాటను ప్రస్తావిస్తూ సినిమాల్లో విషాదగీతాలు అడుగంటాయని విషాదం ప్రకటిస్తున్నారు .కానీ పాత సినిమా పాటలు మాత్రమే వింటూ, కొత్త సినిమా పాటలను తూష్ణీంభావంతో చూస్తూ, చేసే వ్యాఖ్యలివి. ప్రస్తుతం తెలుగులో హిందీ సినిమా పాటలగురించి రాస్తున్న వాళ్లంతా రిటైరయిన వాళ్లో, రిటైర్మెంట్ ముఖంలో ఉన్న వాళ్లో అవటం ఇలాంటి అపోహలకు కారణం. అందుకే ఒకసారి ఇటీవలి కాలంలో విడుదలయిన సినిమాల్లోని సూపర్ హిట్ విషాదగీతాలను విహంగ వీక్షణం చేస్తే, కనీసం భవిష్యత్తులో ఎవరయినా ఆధునిక సినిమాల్లో విషాదగీతాలు 'అక్కడో ఇక్కడో అలా ' అన్న దురభిప్రాయం వ్యక్తపరచే ముందు కాస్తయినా అధ్యయనం చేస్తారన్నది ఆశ.

'కబీర్‌సింగ్' కథ చెప్పనవసరంలేదు. నాయికతో తన సాన్నిహిత్యాన్ని తలపోస్తూ, ప్రస్తుత విరహాన్ని విస్మరించే ప్రయత్నం చేస్తున్నప్పటి పాట ఇది. అస్సలు ఆలోచనలు లేని స్థితిలో కూడా ఆమె గురించిన ఆలోచనలు వస్తున్నాయట నాయకుడు అన్నీ మరచిపోయాను కానీ నిన్ను మరచిపోలేదు' అని కవితాత్మకంగా చెప్తున్నాడు హీరో. అంతేకాదు, 'ప్రేమికుడు విడిపోవటం తప్పనిసరా?' అన్న ప్రశ్న ఉదయించింది హీరోకు. ఇదొక విశ్వజనీన విషాద భావం.

'హర్ ములాకాత్ క అంజాం జుదాయి క్యూన్ హై?'

'షహర్‌యార్ ', 'ఉమ్రావ్ జాన్' సినిమా కోసం అద్భుతంగా రాసిన ఓ గజల్‌లోని పంచ్ లైన్ ఇది. ప్రతి కలయిక ఫలితం విడిపోవటమే. ఎవ్వరూ ఎవ్వరితో ఎప్పటికీ శాశ్వతంగా కలసి ఉండే ప్రసక్తి లేదు. ఏదీ అశాశ్వతం కాదు. అందుకే ప్రతి కలయిక ముగింపు విడిపోవటం ఎందుకు?' అన్న షహర్‌యార్ ప్రశ్న ప్రతిధ్వని 'కబీర్‌సింగ్' సినిమాలో అర్జిత్ సింగ్ స్వరంలో ప్రతిధ్వనించింది.

బేఖుదీ మే భీ కరార్ ఆతా నహీన్, అని శకీల్ బదాయుని రాసిన భావన కూడా ఈ పాటలో కనిపిస్తుంది. తనని తాను మరచిపోయిన స్థితిలో కూడా అతనికి శాంతిలేదట...బే ఖయాలీ లో కూడా ఆమె ఖయాలీ రావటం ఇలాంటిదే. అంటే, ఏ పాటలనయితే పాత తరంవారు తేలికగా చూస్తూ పట్టించుకోవటంలేదో, ఆ పాటలు పాత పాటలలోని భావాలనే కొత్త తరానికి తగ్గట్టు ప్రదర్శిస్తున్నాయన్నమాట. కానీ, పాత పద్ధతి అలవాటయిన తరం కొత్త తరం భావాలను గమనించకుండా, తీర్పునిచ్చేసి గొప్పగా భావించుకుని విషాదాన్ని ప్రదర్శిస్తోంది.

2013లో విడుదలయిన రణబీర్ కపూర్, దీపికాపదుకోనిల సూపర్ హిట్ సినిమా 'యే జవానీ దివానీ'లో అత్యంత విషాద మధురమైన ఆధ్యాత్మిక భావాలతో ముడిపెట్టే ఏ పాత పాటకు ఈ పాట తీసిపోదు.

**కైసీ తేరీ ఖుద్ గర్జీ**
**న ధూప్ చునే న చావ్**
**బన్ లియా అప్ని పైగంబర్**
**తైర్ లియా సాత్ సమందర్**
**ఫిర్ భీ సూఖా మన్‌కే అందర్ క్యూన్ రహగయా?**

అత్యద్భుతమైన భావం. రేఖా భరద్వాజ్ గొంతు ఈ పాటకోసమే దేవుడు తయారు చేశాడా అనిపించేటంత అద్భుతంగా ధ్వనిస్తుంది.

'యే జవానీ దీవానీ' సినిమాలో నాయకుడు స్వేచ్ఛాజీవి. ఎటువంటి బంధాలలో ఇమడడు. అతనికి ప్రపంచమంతా తిరగాలని వుంటుంది. అతడిని ప్రేమించిన యువతికి కన్నీళ్లు తప్ప మరేమీ మిగలవు. అతడికి ప్రపంచం తిరగటం, కొత్త కొత్త స్థలాలు దర్శించటాన్ని మించి మరేమీ అవసరంలేదు. ఓ స్నేహితురాలి పెళ్ళి జరిగే సందర్భంలో ఈ పాట వస్తుంది.

ఇది సంపూర్ణంగా విషాదగీతమా? అంటే కాదనిపిస్తుంది. కానీ, సినిమా సందర్భం ప్రకారం చూస్తే ఈ పాటలో తెరపై కనపడే ప్రధాన పాత్రలన్నిటి జీవితాలలోని, అసంతృప్తులు విషాదాలను ప్రతిబింబిస్తుంది. పాటలో అంతర్లీనంగా మానవుడి సంవేదనల వ్యక్తిత్వం బోధపడుతూంటూంది. వీచికలని భ్రమపడి మరీచికల వెంటపడి జీవితాన్ని విషాదమయం చేసుకోవటం తెలుస్తూంటూంది. అత్యద్భుతమైన పాట ఇది. పాతకాలంలోని అర్ధవంతమైన, హృద్యమైన పాటలకు ఏమాత్రం తీసిపోదు ఈ పాట.

'ఏమిటీ స్వార్ధం?' తన ఇష్టం తప్పించి మరొకరి మనోభావాలను పట్టించుకోని నాయకుడి మనస్తత్వాన్ని సూటిగా ఎత్తి చూపిస్తున్నట్టుంటుంది. కానీ గమనిస్తే, తనను పట్టించుకోని వాడిని ఇంకా ప్రేమించే దీపిక పాత్ర వ్యక్తిత్వం, తనని కాదని మరొకరిని వివాహమాడుతున్నా ఆమెని వెంటపడి వేధించే మరో ప్రధాన పాత్ర మనస్తత్వం, ప్రేమికుడిని మరచి మరొకరిని వివాహమాడుతున్న అమ్మాయి స్వార్ధం.. ఇవన్నీ కూడా 'కైసే తెరీ ఖుదగ్రీ'లో ధ్వనిస్తాయి. 'వెలుతురు నీడలలో ఏదీ ఎంచుకోని స్వార్ధం ఎలాంటిది? ఏ ఎక్కడా నిలకడగా నిలువనివ్వని నీ స్వార్ధం ఎలాంటిది?' అంటూ ఆరంభమౌతుంది పాట. ఎంత స్వార్ధం అంటే తను అనుకున్నదే సత్యం అని అనుకుంటాడు. పాటలో 'పైగంబర్ ' అన్న పదం వాడతాడు. పైగంబర్ అంటే దైవం అని అర్ధం. అంటే తనని తాను దైవసమానకుడిగా భావించుకుని తానేం అనుకుంటే అదే సరైనది అనినమ్మి ఏడు సముద్రాలు ఈదేదన్నమాట. ఏడు సముద్రాలు ఈదటం ఓ ప్రతీక. ఇంత చేసినా అతని దాహం తీరలేదు. నీరులేక ఎండినట్టే ఉంది అతని హృదయం. అద్భుతమైన భావం. మనిషి జీవితంలో రెండు విషాదాలుంటాయట. ఒకటి తాను కావాలనుకున్నది పొందలేకపోవటం. రెండవది తాను అనుకున్నదాన్ని పొందటం ఇక్కడ హీరో తాను అనుకున్నట్టు ప్రవర్తించాడు. అయినా ఆనందం లేదు. సంతృప్తి లేదు.

2015లో విడుదలైన 'తమాషా' సినిమాలో అల్కాయాగ్నిక్, అర్జిత్ సింగ్‌లు పాడిన అతి చక్కని విషాదగీతం ఉంది. ఏ.ఆర్. రహమాన్ సంగీత దర్శకత్వం వహించిన ఈ పాటను రాసింది ఇర్షాద్ కామిల్

**పల్ భర్ ఠహర్ జావో,**

**దిల్ యే సంభల్ జాయే**

**కైసే తుమ్హే రోకా కరు,**

**మేరీ తరఫ్ ఆనా హర్ గం ఫిసల్ జాయే**

**ఆంఖోమే తుంకో భరు, బిన్ బోలే బాత్ తుంసే కరూన్**

**అగర్ తుం సాథ్ హో, అగర్‌తుం సాథ్ హో...**

ఒక్క క్షణం ఆగిపో. నా హృదయాన్ని అదుపులోకి తెచ్చుకోని. నా వైపు వస్తున్న విషాద వీచికలు కరిగిపోనీ, కళ్లనిండా నిన్ను నింపుకుంటాను. మౌనంగా నీతో ఇంతవరకూ చెప్పని మాటలు చెప్తాను. ఇదంతా ఎప్పుడంటే 'నువ్వు నాతో ఉంటే...' అంటోంది నాయిక.

రహెరియే హోష్ మే ఆవూ తొ, చలే జాయేగా' అన్నది అత్యంత రొమాంటిక్ యుగళగీతం. 'ఎక్ ఫల్ రుక్ జానా' అన్నది మరో విషాదగీతం. అలాంటి అద్భుతమైన పాటలకు భావంలోకానీ, బాణీ విషయంలోకానీ, గానంలో కానీ ఏమాత్రం తీసిపోని చక్కటి పాట ఇది.

2014లో వచ్చిన 'హంప్టీ శర్మకీ దుల్హనియా'లో అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషాల్‌ల స్వరాలలో ఓ అద్భుతమైన విషాదగీతంఉంది.

**మై తేణు సంఝావాన్ కీ, 'న తేరే బినా లగ్దాజీ,**

**తూకీ జానే ప్యార్ మేరా**

**మై కరూన్ ఇంతెజార్ తెరా**

**తూ దిల్ తూయియోన్ జాన్ మేరీ...**

"నువ్వు లేని నేను లేను" అని నీకెలా అర్థమయ్యేట్టు చెప్పాలి? అని అడుగుతున్నాడు హీరో. నువ్వే నా హృదయం. నువ్వే నా జీవితం. నీకు నా ప్రేమ గురించి ఏం తెలుసు? నువ్వు లేక నేను లేనని నీకెలా చెప్పాలి? నువ్వే నా ప్రాణం ' అని జాలిగా అడుగుతున్నాడు హీరో. 'యే దిల్ తుం బిన్ కహీ లగ్తా నహీ, హం క్యా కరేన్ ' అంటుంది 1960లలోని మధురమైన గీతంలో నాయిక. అప్పటికీ ఇప్పటికీ భావంలో మార్పు రాలేదు. విషాదంలో మార్పురాలేదు. శాస్త్రీయ రాగ ఆధారిత గీతాలను రూపొందించటంలో మార్పు రాలేదు. పహాడీ రాగం , భూపాలరాగాల నడుమ ఊగిసలాడుతూ అత్యంత అందమైన అల్లరి చేసే బాణీని అంత అద్భుతంగా పాడారు గాయనీ గాయకులు. ఇటీవలి కాలంలో వచ్చిన మరుపురాని మధురమైన విషాద గీతాలలో ఇదొకటి.

2019లో అర్జిత్ సింగ్ స్వరంలో , మనోజ్ ముంతషిర్ రచించిన మై ఫిర్ భీ తుంకో చాహూంగా ' పాతకాలం నాటి ఏ ప్రేమ విషాద గీతానికి తీసిపోదు. జీవితాంతం నిన్ను తలచుకుంటూ, ప్రేమిస్తూనే ఉంటాను అంటూ సాగే ఈ గీతం అత్యంత మధురమైనది, మనస్సు దోచేటటువంటుది. మరుపురానిది.

**తుం మేరీ హో, ఇస్ పల్ మేరే హో**

**కల్ షాయద్ యే ఆలం న రహే**

**కుఛ్ ఐసాహో తుం తుం న రహో**

**కుచ్ ఐసాహో, హం హం న రహే**

**యే రాస్తే అలగ్ హోజాయే**

**మై ఫిర్‌భి తుం కో చాహూంగా**

**ఇస్ చాహత్ మె మర్ జావూంగా**

**మై ఫిర్ భి తుం వో చాహూంగా...**

నువ్వు నాదానివి. ఈ క్షణం నాదానివి. రేపు ఈ పరిస్థితి ఉండకపోవచ్చు. వాతావరణం మారిపోవచ్చు. నువ్వు నీలా ఉండకపోవచ్చు. నేను నాలా ఉండక పోవచ్చు. ఇద్దరం మారిపోవచ్చు. మన దారులు వేరు అవవచ్చు. ప్రయాణంలో మనం ఎవరి దారుల్లో వారు వెళ్లిపోవచ్చు. దూరమైపోవచ్చు. కానీ నేను నీ ప్రేమలోనే మరణిస్తాను. నేను నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. అతి చక్కని భావం. చక్కటి పాట. చాహే కహీ భి తుం రహో చాహేంగె తుంకో ఉమ్ర్ భర్, తుం కో నభూల్ పాయేంగే ' అన్న భావాల్ని అతి చక్కగా ప్రదర్శిస్తుంది.

ఇలాంటిదే 'రాయ్' సినిమాలో అంకిత్ తివారీ పాడిన పాట.

**ముఝేసే హి ఆజ్ ముఝ్ కో మిలాదే**

**దేఖూన్ అదతోం మే, తూ హై కి నహీ..**

**హర్ సాస్ సే పూచ్ కే బతాదే**

**ఇన్‌కే ఫాస్లోంమే తూ హైకి నహీ..**

**మై ఆస్. పాస్ తేరా..**

**ఔర్ మేరే పాస్.. తూహై కే నహీ..**

తన అణువణువులో, ఊపిరిలో ఆమె ఉంది. ఉన్నావా? లేదా? అని అడుగుతున్నాడు హీరో. నాతో నన్ను కలపండి. 'అదత్ ' అంటే ప్రధానంగా 'అలవాటు' అని అర్థం చెప్తారు. కానీ 'అదత్' అంటే 'స్వభావం ' అన్న అర్థం కూడా ఉంది. 'ప్రకృతి' అన్న అర్థం కూడా ఉంది. ఇక్కడ నాయకుడు తనకు తనని పరిచయం చేయమంటున్నాడు. తన ప్రకృతిలో ఆమె ఉందా? లేదా" అని ప్రశ్నిస్తున్నాడు. అంతగా విడదీయరానిదన్నమాట ఆమెతో నాయకుడి అనుబంధం. తన ఊపిరిలో, ఉచ్ఛ్వాస నిశ్వాసల నడుమ ఉండే స్వల్ప సమయంలో ఆమె ఉందా? లేదా? అని ప్రశ్నిస్తున్నాడు. అతడు ఆమెకి దగ్గరగా ఉన్నాడు. ఆమె అతనికి దగ్గరగా ఉందా? లేదా? అని అడుగుతున్నాడు. అతి చక్కని పాట. ఈ పాట కూడా మాధుర్యంలోకానీ, గానంలోకానీ, వాయిద్యాల వాడకంలో కానీ ఏ రకంగానూ పాత పాటలకు తీసిపోదు.

ఇక్కడ ప్రస్తావించినవి కొన్ని విషాద గీతాలు మచ్చుకి మాత్రమే. అక్కడా ఇక్కడా ఒక పాటలాంటి పాటలు కావు. ఈ పాటలు సూపర్ హిట్‌లవటంతో ఇలాంటి పాటలు ఎన్నో తయారయ్యాయి. వాటన్నిటి జాబితా అనవసరం. కానీ ఇపుడూ కూడా ఆ పాతపాటలతో సరితూగగల అత్యద్భుతమైన విషాదగీతాలు వస్తున్నాయి. సినీ గేయరచయితలు అతి

చక్కటి భావాలను చిలికిస్తున్నారు. గాయకులు, పాటల్లోని భావాలతో మమేకమై అంతే అద్భుతంగా పాడుతున్నారు .అయినా సరే, ఇప్పుడు వస్తున్న పాటలు బాగుండటం లేదని, విషాదగీతాలు రావటం లేదన్న అపోహ నెలకొనటానికి ప్రధాన కారణం, పాత తరానికి, కొత్త తరానికీ 'విషాదం' అన్నభావనను చూసి, అర్థం చేసుకుని, అనుభవించి ప్రదర్శించే దృక్కోణంలో ఏర్పడిన అంతరం. ఇప్పుడు పాటలలో పంజాబీ పదాలు, పాప్ భాంగ్రాలూ పాశ్చాత్య నృత్యాలకు లైంగిక కదలికలను పోలిన కదలికలతో ఊగే చిన్న బట్టల అమ్మాయిలు ప్రధానంగా కనబడుతూండటంతో చక్కటి మాధుర్యంతో ఉన్న పాటలు రావటం లేదన్న భ్రమ కలుగుతుంది. దీనికి తోడు ఒకప్పుడు విషాదాన్ని, ప్రదర్శించే తీరు, ఇపుడు ప్రదర్శించే తీరుకూ తేడా వచ్చింది .

ఈ తరం విషాదాన్ని అనుభవించే విధానంలో కూడా మార్పు వచ్చింది. ఇప్పుడు విషాదం కలిగితే దాన్ని దాచుకోవటంలేదు. పదిమందితో పంచుకుంటున్నారు. తమ విషాదాన్ని బహిరంగం చేస్తున్నారు. విషాదంలో కూరుకుపోవటంలేదు. విషాదాన్ని సృజనాత్మకంగా వాడుకుంటున్నారు. విషాదాన్ని వదలి, బాధను అణగద్రొక్కుకుని ముందుకు సాగుతున్నారు. ఇందుకు కొందరు దైవాన్ని ఆశ్రయిస్తే, కొందరు ఆత్మవిశ్వాసం ఆలంబనగా ముందుకు సాగుతున్నారు. అంతే తప్ప, గతంలోలా 'చాంద్ ఫిర్ నిక్‌లా మగర్ తుం న ఆయే ' అనో, 'ముఝ్‌కొ ఇస్ రాత్‌కి తణన్హాయీమే ఆవాజ్ నదో ' అంటూనో, 'తేరీ దునియామె దిల్ లగ్తా నహీ' అనో. 'ఆసూ భరె హై యె జీవన్ కి రాహె' అనో ఏడుస్తూ పాడటంలేదు. విషాదాన్ని ఊతంగా చేసుకుని ముందుకు సాగుతున్నారు. పైగా, గతంలోలాగా, విషాద గీతాలలో సారంగి, వేణువులు మ్రోగటం లేదు. ఇప్పుడు రాక్, జాజ్, ఫంక్ సంగీతాలతో సూఫి పాటలు, భజనలు జతగలసి, శాస్త్రీయ సంగీత రాగాలతో కలసి పాటలు రూపొందుతున్నాయి. అందుకని పాత పాటలు వినేవారికి ఇప్పటి పాటలలో విషాదం కనబడటంలేదు. పైగా పాత పాటలతో ఓ రకమైన భావాత్మక, 'ఎమోషనల్ అంటాచ్‌మెంట్ ' ఉంది. అది కొత్తపాటలతో ఏర్పడటంలేదు పాత తరానికి. కానీ ఈ పాటలను విని ఆనందించటంలో కానీ, మైమరచిపోవటంలో కానీ యువతరానికి ఎలాంటి అడ్డంకులు లేవు. ఎందుకంటే, వారి మెదళ్లలో 'గతం' బరువు లేదు కాబట్టి. అందుకని కొత్త పాటలను యువతరం హృదయానికి హత్తుకుంటోంది.

'రాక్ స్టార్ ' సినిమాలో నాయకుడిని ఇంట్లోంచి గెంటేస్తారు. అప్పుడు నేపథ్యంలో వినిపించే సూఫీ భజన గీతం స్ఫూర్తివంతమైనది. విషాద సన్నివేశంలో విషాదాన్ని ప్రకటిస్తూ, ఆశాభావం వైపు నడిపిస్తుందీపాట.

**కదం బఢాలే, హదోంకో మిటాదే**

**ఆజా ఖాళీ పన్ మె పీకా ఘర్ తేరా**

**తేరే బినా ఖాళీ, ఆజా ఖాళీ పన్‌మే**

**రంగేజా... రంగేజా... రంగేజా**

**కున్ ఫాయా కున్ఫాయా కున్ ...**

ఇంట్లోంచి బయటకు గెంటేశారు. ఒంటరిగా ఉన్న హీరోకి సూఫీల భజన పాట స్ఫూర్తినిస్తుంది. అడుగు ముందుకు వెయ్యి. పరిధులను దాటెయ్యి. నీ ప్రియతమ ఇల్లు నువ్వు లేక ఖాళీగా ఉంది. త్వరగా వచ్చేయి... అంటూ.. ఇదంతే...ఇదంతే.. అంటూ సాగుతుంది పాట. కున్ ఫాయా కున్ ఫాయా కున్ అన్న రిఫ్రెయిన్ చాలా అద్భుతంగా వుండి పాట ప్రభావాన్ని పెంచుతుంది.

'ఏయ్ దిల్ హై ముష్కిల్ ' సినిమాలో తన విఫలప్రేమ వేదనను హీరో పాటగా మలుస్తాడు. జీవితంలో ముందుకు సాగుతాడు.

**తూ సఫర్ మేరా, హై తూ హీ మేరీ మంజిల్**

**తేరేబినా గుజారా, ఏ య్ దిల్ హై ముష్కిల్**

**తూ మేరా ఖుదా, తూహి దువా మే శామిల్**

**తేరె బినా గుజారా , ఐ దిల్ హై ముష్కిల్**

**ముఝె ఆజ్మాతీ హై తెరీ కమీ.**

**మే రీ హర్ కమీకో తూ హై లాజ్మీ**

**జునూన్ హై మెరా**

**బనూ మై తేరే కాబిల్**

**తేరే బినా గుజారా**

**ఐ దిల్ హై ముష్కిల్**

నా ప్రయాణం నీవే. నా గమ్యం నీవే. నువ్వు లేకుండా జీవితం గడపటం కష్టం. నువ్వు లేని జీవితం గడవటం కష్టం. నువ్వు లేని లోటు నన్ను బాధిస్తుంది. నా జీవితం లోని అన్ని సమస్యలకూ నువ్వే సమాధానం. నీకు తగినవాడిగా ఎదగాలన్నది నన్ను వేధించే తీవ్రమైన కోరిక అంటూ సాగే ఈ పాట ద్వారా హీరో ఫేమస్ అయిపోతాడు.

కాలం మారుతుంది. జీవన విధానం మారుతుంది. భావాలు మారతాయి. భావ ప్రకటనా విధానం మారుతుంది. కానీ మారనిది మనిషిలో గూడు కట్టుకున్న విషాద భావన. సుఖం కోసం వెతుకుతాడు. దుఃఖం పొందుతాడు. చంద్రుడి కోసం చేయి సాచితే, గుప్పెట్లో మిగిలేది చీకటే, ప్రపంచం ఎంత మారినా ఈ విషాద భావన మాత్రం మారదు. ఇది కళల్లో అంతరించినప్పుడు, మానవుడిలో మృదువయిన భావనలు, సున్నితత్వం అలరించినట్టే. మనిషి పశువయినట్టే. కానీ కాలాన్ని బట్టి ప్రేమ భావనా స్వరూపం మారవచ్చు. దానివల్ల కలిగే విషాద స్వరూపం రూపాంతరం చెందవచ్చు. కానీ విషాదం ఎలాగయినా తప్పని సరి మనిషి జీవితంలో. ఆ విషాద భావనలను సుందరంగా వ్యక్తం చేసే గీతాలే, విషాదానికి

విరుగుడు. అందుకే సినిమాల్లోంచి విషాదగీతాలు అంతరించటం జరిగేపని కాదు. కానీ, ఎప్పుడయితే సినిమాలు హీరోల కోసం నిర్మితమవుతాయో, అప్పుడు సినిమాల్లో మనుషులు కనబడరు. అలాంటి సినిమాల్లో విషాదగీతాలుండవు. ఇప్పుడొస్తున్న తెలుగు సినిమాలనేకం హీరోలు కేంద్రంగా రూపొందేవే కాబట్టి విషాదగీతాలు వినబడటంలేదు. కానీ, హిందీ సినిమాల్లో కొందరు నటులు, హీరోగా ఇమేజీ సంపాదించేకన్నా, నటుడిగా విభిన్నమైన పాత్రల ద్వారా వినూత్నమైన నటనతో మానవ సంవేదనలను ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నారు. అలాంటి సినిమాల్లో విషాద గీతాలు తప్పనిసరి. ఎదుకంటే ఆసినిమాల్లో మనుషులుంటారు కాబట్టి, మానవ సంవేదనలు, ఆవేదనలుంతాయి. మానవ సంవేదనలను, ఆవేదనలను పాటలు తప్ప ప్రదర్శించేందుకు మరో శక్తివంతమైన సాధనంలేదు. అందుకే ఒక కవి ఘర్ సే చలేథే హమ్తో ఖుషీ కీ తలాష్ మే , గం రాహమే ఖడే హై వొహీ సాథ్ హోలియే అంటే, మరో కవి, సుఖ్ హై ఎక్ చావ్ ఢల్తీ, ఆతీ హై, జాతీ హై, దుఖ్ తో అప్నా సాథీ హై అన్నాడు. కాబట్టి విషాదంలేకపోతే జీవితమేలేదు. మరో కవి అన్నట్టు ఈ జీవితంలో అత్యంత సౌందర్యవంతమూ, సౌఖ్యవంతమూ అయినదేదయినా వుంటే అది విషాదమే!

(మలిన్ని మధురమైన పాటలతో వచ్చే నెల.)

Click here to share your comments